కథ

# ఊరపిచుకలు

జి. అనసూయ

"నాన్నా.... నాన్నా.... ఇలారా...." నా అయిదేళ్ళ కూతురు నన్ను బాల్కనీలోకి లాక్కువచ్చింది.

"చూడు నాన్నా మనింటికి ఎవరొచ్చారో," వేలితో బాల్కనీ చివరకు చూపెడుతూ సంభ్రమంగా అంది నా గారాలపట్టి స్నేహ.

బాల్కనీ చివర పూలకుండీల పక్కగా రెండు ఊరపిచుకలు కిచకిచ లాడుతూ నేలను ముక్కులతో పొడుస్తూ దేనికోసమో వెతుకుతున్నట్లుగా అటూ ఇటూ గెంతుతున్నాయి.

"నాన్నా అవి స్కిప్పింగ్ చేస్తున్నాయా" వాటినే తదేకంగా చూస్తున్న స్నేహ ఆసక్తిగా అడిగింది.

అవును వాటి కదలిక పెక్యూలియర్‌గా చిన్నపిల్లలు రెండుకాళ్ళు ఎత్తి స్కిప్పింగ్ చేస్తున్నట్లుగా ఉంది.

"ఒహ్ ఎన్నాళ్ళయింది ఈ దృశ్యాన్ని చూసి". అసలు ఈమధ్యకాలంలో ఊరపిచుకలే కనబడటం లేదు. ఇవి ఎక్కడ్నుంచి వచ్చాయో మా అపార్టుమెంటు వెతుక్కుంటూ.

"అవి ఏం బర్డ్స్ నాన్నా! మనింటికి వచ్చాయి" 'ఎందుకు వచ్చాయి నాన్నా' స్నేహ బుర్రనిండా ప్రశ్నలే ఒక ప్రశ్న పూర్తి కాకుండానే ఇంకో సందేహం. మా అలికిడికి పిచుకలు ఎగిరి వెంటిలేటర్‌పై వాలాయి.

"అవెందుకు నాన్నా మనని చూసి భయపడుతున్నాయి" స్నేహ కళ్ళల్లో జాలి వాటిని దగ్గరగా చూడాలన్న ఆశ.

పాపను ఎత్తుకుని హాల్లోకి వచ్చాను. వెంటిలేటర్లోంచి పిచుకల కిచకిచలు పసిపాపల నవ్వుల్లా హాయిగా ఉన్నాయి.

"వాటిని మనింట్లోనే ఉండనిద్దాం నాన్నా...." నా మెడచుట్టూ చేతులేసి గారంగా అడిగింది స్నేహ.

"అలాగేనమ్మా... అవి మనింట్లోనే ఉంటాయి. వాటిని ఇంగ్లీష్‌లో హౌస్ స్పారోస్ అంటారు. అవి రైతు స్నేహితులు. అవి పంటపొలాల్లోని క్రిములను, కీటకాలను ఏరుకుని తిని రైతుకు సహాయం చేస్తాయి. అందుకనే రైతులు తమ ఇండ్లల్లో దూలాలకు చూరులకు జొన్నకంకులను, వరికంకులను కట్టి వాటికి ఆహారంగా పెడతారు.... నా మనసు ఒక్కసారిగా నాకు తెలియకుండానే నా పల్లెకు పరుగుతీసింది.

నాకు ఆరేడేళ్ళ వయస్సప్పటినుండి ఆదివారం వచ్చిందంటే చాలు నాన్నతో పొలం వెళ్ళడం అలవాటు. పొలమూ, బాయి ఊరికి చాలా దూరమే అయినా నాకు బడికి వెళ్ళడం కంటే బావికాడికి వెళ్ళడమంటేనే ఇష్టంగా ఉండేది. మా ఊరి పొలిమేర దాటి కొంతదూరం వెళ్ళాక ఎడమప్రక్క ఓ రాళ్ళగోడ ఉండేది. రాళ్ళగోడ అంటే ఎర్రటి, గుండ్రటి రాళ్ళు నాలుగైదు వరుసలు ఒకదాని మీద ఒకటిగా పేర్చి ఉండేవి. ఆ రాళ్ళగోడ దాటితే అన్ని మావాళ్ళ చెలుకలే మా పెదనాన్నలు, బాబాయిలు మా పెత్తాత కొడుకులవి మా రమణత్తవి పొలాల్లో ఎప్పుడూ నాట్లో కలుపులో కంకులు ఏరడమో ఏడాది పొడుగూతా పనిచేస్తూనే ఉండేవాళ్ళు.

దారెంట ఎవరో ఒకరు పలకరిస్తుండేవాళ్ళు. ఆడవాళ్ళయితే ఏం చిన్నదొరా..... ఎండల బయల్దేరినవ్ అంటూ పరాచికాలాడేవాళ్ళు. నన్ను బావి గట్టు మీద కూర్చోబెట్టి నాన్న చేనుకు మందుకొట్టడానికో, నీళ్ళు పెట్టడానికో వెళితే నేను మేకల గాసే రంగడితోనో, బర్లగాసే సాయిలుతోనో గోటీలాట ఆడుకుంటుండెటోన్ని. రంగడు మేక కిందుగా వంగి పాలు నోట్లోకి పిండు కునేటోడు. బాగుంటయా... అన్న నన్ను లాగి మేక కింద కూర్చోబెట్టిండు ఓసారి. జుయ్ జుయ్ మని పాలు పిండుతుంటె మొహం నిండ పాలనురగ. చిక్కటి, వెచ్చటి తియ్యటి పాలు ఒకలాంటి వాసనతో. ఆ రోజంతా నాకు ఆకలే వెయ్యలా. అమ్మకు చెబితే అసలే మేకపాలు అరగవురా అంటూ బెల్లంముక్క నోట్లో వేసింది. హైస్కూలు చదువుకొరకు పట్నంలో రూం తీసుకొని స్నేహితులతో మకాం పెట్టాక క్రమంగా ఊరికి దూరమవుతూ వచ్చాను. నేను కాలేజికి వచ్చేసరికి ఊర్లో చాలా మార్పులు వచ్చాయి. మా ఇద్దరు అక్కల పెళ్ళిళ్ళకు నాన్న కొంత పొలం అమ్మేసాడట. బావులు ఇంకిపోయి బోర్లు వేస్తున్నరు. కరెంటు ఎద్దడి. మోటర్లు కాలిపోవడం. నాగళ్ళ స్థానంలో కిరాయి ట్రాక్టర్లతో దున్నించడం. కాడి ఎడ్లు, పాడి బర్లు పొయినయ్. సేంద్రియ ఎరువుల స్థానంలో రసాయన ఎరువులు. కృత్రిమ విత్తనాలు..... ఆధునిక వ్యవసాయ పద్ధతులు. నాన్నలాంటి వాళ్ళు.... కమర్షియల్ పంట అని పత్తి పెట్టి చేతులు కాల్చుకున్నరు. పత్తిపంట వచ్చాక వేరే పంటలే పండకుండ అయినవంట. మందులకు లొంగని పురుగు లొచ్చినవంట.

అమ్మ నన్ను వ్యవసాయం దిక్కే చూడనిచ్చేది కాదు. "నీవన్న ఇంత చదువుకొని ఏ నౌకరో చేసుకొని బతుకరా.... ఈ వ్యవసాయం ఇన్నాళ్ళటోలిగ లేదు" అనేది.

స్కాలర్‌షిప్పులు పార్ట్‌టైం జాబ్స్‌తో ఎలాగోలా పి.జి దాకా లాక్కొచ్చాను. సర్వీస్ కమిషన్ ఎగ్జామ్ రాయడం.... సెలెక్షన్ ఇంటర్వ్యూ.... ఉద్యోగం.... మొత్తానికి బతుకుబండి పట్టాల మీదకెక్కింది. వచ్చిన సంబంధాలలో నచ్చినది ఎన్నుకొని అరుణను జీవిత భాగస్వామిని చేసుకున్నాను. ఈ కాంక్రీటు వనంలో ఓ కాంక్రీటు గూడు కట్టుకున్నాను. ఈ పొడి జీవితంలో ఏ పుప్పొడిని చూద్దామనో మా బ్రతుకుల్లోకి వచ్చింది సీతాకోకచిలుక లాంటి మా స్నేహ.

"ఏంటి నాన్నా పిచుకల గురించి చెబుతానని నిద్రపోతున్నావ్ తట్టి" పిలిచింది స్నేహ.

ఓసారీరా... అంటూ ఈ లోకంలోకి వచ్చాను. ఎవరో కాలింగ్‌బెల్ కొడుతున్నట్టున్నారు. వెళ్ళి తలుపు తీశాను. ఎదురుగా అమ్మ. వాడిపోయిన మొహం.... అలిసిన దేహం... అరె అమ్మా ఎండలో వచ్చావే... నాన్న అంటూ చూసేసరికి నాలుగడుగుల వెనుక నాన్నను నడిపించుకొస్తున్న సందీప్ నాకు చిన్నాన్న కొడుకు.

ఏమయిందిరా నాన్నకేమయింది అంటూ వెళ్ళాను.

ఏం కాలేదన్నా.... పెదనాన్న పెద్దమ్మ లగేజితో వస్తున్నారు కదా. తోడుగా వెళ్ళి దించి రమ్మన్నాడు నాన్న.... ఉండు కింద ఇంకా సామాను ఉంది. చేతిలోని పెద్ద సంచీ గోడ పక్కన పెట్టి కిందకు వెళ్ళాడు సందీప్.

నాన్నను లోపల కూర్చోబెట్టి నేనూ వెళ్ళాను సందీప్‌తో.

అమ్మ ఎప్పుడు వచ్చినా సంచులనిండా కూరగాయలు చిరుతిళ్ళు పాలు పెరుగు నెయ్యి తేవడం అలవాటే కాని ఈసారి వంటసామానుతో పాత ఇత్తడి పాత్రలతో సహా.... ఊరొదిలి వస్తున్నట్లుగా, కాందిశీకులలా....

"సెజ్ కొరకు మన భూములన్ని పోతున్నయ్ అన్నయ్యా మన ఊర్లోంచి రింగురోడ్డు పడుతున్నదంట. మన ఇండ్లన్ని కూలగొడుతున్నరు. రెండు రోజుల్లో ఖాళీ చెయ్యమని నోటీసులు ఇచ్చింద్రు. పెదనాన్నేమో. ప్రాణం పోయినా ఊరొదలనంటూ కూర్చున్నడు. నాన్ననే ఎట్లనో నచ్చజెప్పి నీ దగ్గరికి పంపిందు" చెప్పిందు సందీప్.

"నాన్నమ్మా..... నీకంటే ముందే మనూరి పిచుకలు మనింటికి వచ్చినయ్ చూద్దువు దా......" అంటూ స్నేహ అమ్మను బాల్కనీలోకి తీసుకువెళుతోంది.

అరుణ ఇచ్చిన కాఫీ త్రాగి వెళ్ళదానికి లేచాడు సందీప్. "మరి ఊర్లో అంతా ఎలారా...." అన్నాను నేను బరువు గుండెతో. "అంతా ఇలాగే వెళుతున్నా రన్నయ్యా. మేం మా మామయ్య వాళ్ళూరు వెళుతున్నాం భూముల పైసలొచ్చాక ఆడ్నే భూమి కొందామనుకుంటున్నారు. మన భూముల్లల్ల తోళ్ళ కంపెనీ పెడ్తరంట, అందులో భూములు పోయినోళ్లకందరికి ఉద్యోగాలిస్తరంట." సందీప్ గొంతులో ఏ ఫీలింగ్ లేదు. ఏదో పెనుమార్పు రాబోతుందనే ఎగ్జైట్‌మెంటు తప్ప.

"నాన్నమ్మా.... పిచ్చుకలు ఇంక ఇప్పటినుండి మనింట్లోనే ఉంటాయి. మనం వాటికి రోజు గింజలు వేద్దాం"

"అలాగేనమ్మా.... ఈ మాయదారి సెజ్‌లు మనుషుల్నే కాదు పిచుకల్ని కూడా ఊర్లల్ల ఉండనియ్యడం లేదు" గొణుగుతున్నట్లుగా అంటుంది అమ్మ.

ఈ సరికొత్త మార్పును జీర్ణించుకోలేని అరుణ అమ్మవాళ్ళ సామానంతా ఎక్కడ సర్దాలా అన్న ఆలోచనలో ఉన్నట్టుంది.

## ☺ హాస్య చినుకులు ☺

'పాతికేళ్ళుగా ఆ హీరోతో నటిస్తున్నారు కదా, అప్పటికి, ఇప్పటికి ఆయనలో ఏదైనా మార్పు వచ్చిందా?' హీరోయిన్‌ని అడిగాడు విలేఖరి.

'ఆ.... ఇంతకుముందు ఆయన గడ్డం గుచ్చుకునేది. ఇప్పుడాయన ఎముకలు గుచ్చుకుంటున్నాయి' చెప్పిందా హీరోయిన్.

☺ ☺ ☺

'వెయ్యి అబద్ధాలాడయినా ఓ పెళ్ళి చేయమన్నారు. కాని, పెళ్ళిళ్ళపేరయ్య మరీ ఇంత ఘోరంగా అబద్ధం ఆడతాడనుకోలేదు.'

'ఇంతకీ ఏం అబద్ధం ఆడాడు?'

'అబ్బాయి ఏరోప్లేన్లో కండక్టర్‌గా పనిచేస్తున్నాడని చెప్పాడు.'

☺ ☺ ☺

'దువ్వెనకి ఇంకో పేరేమిట్రా?' అడిగాడు హరి.

'ఈకల సవరణ యంత్రం' చెప్పాడు గిరి.

☺ ☺ ☺

భార్య : 'ఛీ.... ఛీ..... మిమ్మల్ని చేసుకుని ఏం సుఖపడ్డానులెండి' కోపంగా అరిచింది.

భర్త : 'నన్ను చేసుకొని సుఖపడందే నువ్వు నలుగురు పిల్లల్ని కన్నావా....' ఇంకా కోపంగా అరిచాడు భర్త.

☺ ☺ ☺

ఇంటర్వ్యూకి వెళ్లాడు ముకుందం.

'మనదేశంలో నీకు తెలిసిన ముగ్గురు గొప్పవాళ్ళ, ఉత్తముల పేర్లు చెప్పు.....' అన్నాడు ఆఫీసర్.

'మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ - మూడోది మరి మీ పేరు నాకు తెలియదు సార్.....' అన్నాడు ముకుందం.

☺ ☺ ☺

'సోమూ! పదో తరగతి పరీక్షలైపోయాయి. ఇపుడేం చేస్తున్నావ్....?'

'సెప్టెంబర్‌కు ప్రిపేరవుతున్నా......'

☺ ☺ ☺

డాక్టర్ : బిడ్డకీ బిడ్డకీ దూరం వుండాలమ్మా!

ఆమె : అందుకే కదా డాక్టర్, మొదటి కాన్పు బెంగుళూరులో అయిందా, రెండవకాన్పుకి బెజవాడ వచ్చాను.

☺ ☺ ☺

- వై.కె.మూర్తి